

వస్త్ర పరిశ్రమకు ఊరటనిచ్చేనా?

- రాష్ట్ర బడ్జెట్ వైపు సిరిసిల్ల నేతన్నల చూపు
- టెక్స్‌టైల్ జోన్‌పై ఆశలు
- వర్కర్ టు ఓనర్ పథకానికి నిరీక్షణ
- ప్రభుత్వ ఆర్డర్ల కోసం ఎదురు చూపులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

బడ్జెట్ అనగానే అన్ని వర్గాల్లో భారీ అంచనాలు. పన్నుల పోటు, మినహా యింపులు, కొత్త పథకాల కేటాయింపుల కోసం ప్రజలు అసక్తిగా ఎదురు చూస్తారు. గురువారం ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు తాత్కాలిక బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఈ సారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో వరాలు కురిపిస్తారని జిల్లా ప్రజలు భావిస్తున్నారు. మరో వైపు సిరిసిల్ల పవర్‌లూం నేత కార్మికులు ఉపాధి ఆశలతో బడ్జెట్ వైపు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ బట్ట ఉత్పత్తి ఆర్డర్లతో నిరంతరం వినిపించిన మర మగ్గాల చప్పుళ్లు నిలిచిపోయాయి. ఆత్మహత్యల ఆందోళనల మధ్య ఉపాధి కోసం మళ్లీ వస్త్ర పారిశ్రామికులు, నేత కార్మికులు, ఆందోళనల బాట పట్టారు. బడ్జెట్ సమా వేశాలు కొనసాగుతున్న క్రమంలో సిరిసిల్లలో రిలే నిరాహా రదీక్షలు, రాస్తారోకోలు కొనసాగిస్తున్నారు. బడ్జెట్ రోజే సిరిసిల్ల బంద్‌కు పిలుపునిచ్చారు. బడ్జెట్ తరువాత 26న చలో హైదరాబాద్ నిర్వ హించ నున్నట్లు చెప్పారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర బడ్జెట్‌లో సిరిసిల్ల వస్త్ర పరి శ్రమకు ఊరటనిచ్చే విధంగా కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నారు.

● 'రాజన్న'కు నిధులొచ్చేనా?

తెలంగాణలోనే అతి ముఖ్యమైన పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లు తున్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభి వృద్ధిపై నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు. వేములవాడ ఎమ్మెల్యేగా ఉన్నా ఆది శ్రీనివాస్ విప్‌గా ప్రభుత్వంలో కీలకంగాఉండడంతో ఈ సారి నిధులు కేటాయింపుపై ప్రత్యేక దృష్టి పెడతారని భావిస్తున్నారు. అతిపెద్ద శైవక్షేత్రంగా ఉన్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 2015 జూన్ 18వ తేదిన ముఖ్యమంత్రి హోదాలో వచ్చిన సందర్భంలో కనివినీ ఎరుగని రీతిలో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. 2016లో వేములవాడ దేవస్థానం ఏరియా అభివృద్ధి అథారిటీని ఏర్పాటు చేశారు. కేసీఆర్ చైర్మన్‌గా వ్యవహరించారు. వీటీడీఏ ఆధ్వర్యంలో రూ.410 కోట్ల అంచనాతో 13 అంశాలతో నిధుల కోసం ప్రతిపాదనలు పంపించినా నామ మాత్రంగానే నిధులు వచ్చాయి. గతలో కేవలం రూ. 77.90 కోట్లు పనులు మాత్రమే చేశారు. ఇప్పటికి వేములవాడ దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులకు సంబంధించిన తుది డిజైన్లు ఖరారు కాలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయం, పాదయాత్రలో రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధిపై హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న నేపథ్యంలో దేవస్థానం అభివృద్ధికి నిధులు వస్తాయని భావిస్తున్నారు.

● తీరని మెగా ఆశలు

సిరిసిల్ల నేతన్నల దశాబ్దాల కల మెగా పవర్‌లూం క్లస్టర్. దేశంలో కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు మెగా క్లస్ట ర్‌లు ఇస్తున్నా సిరిసిల్ల నేత కార్మికు లకు మాత్రం నిరాశను మిగులుస్తోంది. ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌ల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా నిరాశనే మిగిలిస్తున్నాయి. సిరిసిల్ల వస్త్ర సంక్షోభ సమయంలో గతంలో కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు సిరిసిల్లలో పర్యటించారు. టెక్స్‌టైల్ జోన్ ఏర్పాటుతోపాటు, మెగా పవర్‌లూం క్లస్టర్‌గా మార్చి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. శాశ్వత ఉపాధికి పవర్‌లూం క్లస్టర్ దోహదపడుతుందని భావించారు. కేంద్ర ప్రభుత్వం హామీలకే పరిమితమైంది. సిరిసిల్ల మెగా పవర్‌లూం క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి ప్రతిపాదనలు పంపిస్తూనే ఉన్నారు. 2013లో అప్పటి కాంగ్రెస్ కేంద్ర జౌళి శాఖ మంత్రి కావూరి సాంబ శివరావును సిరిసిల్లకు రప్పించిన ప్రస్తుత మంత్రి కేటీఆర్, అప్పటి ఎంపీ పొన్నం ప్రభాకర్ మెగా పవర్‌లూం క్లస్టర్ హామీ పొందారు. అప్పటి బడ్జెట్‌లోనే ప్రకటిస్తారని ఆశించారు. కానీ నిరాశే మిగిలింది. 2004లో తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి వద్ద 60 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కును రూ.7.73 కోట్లతో ఏర్పాటు చేశారు. టెక్స్‌టైల్ పార్కులో ఆధునిక మరమగ్గాలను స్థాపిం చారు. దేశవిదేశీ మార్కెట్‌లో అమ్ముడుపోయే విలువైన వస్త్రాలను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్న పార్కు లోకి అనుబంధ పరిశ్రమలు రాకపోవడంతో ఉత్పత్తుల్లో మార్పులు రాలేదు. సిరిసిల్లలో లో టెక్నాలజీ మరమగ్గాలపై ఆధునిక ఉత్పత్తులు చేయలేక తరచూ పరిశ్రమ సంక్షోభాన్ని చవిచూసింది. ఆత్మహత్యలు, సంక్షోభం నేపథ్యంలో సిరిసిల్లలో మార్పులు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు భావించాయి. అప్పటి కేంద్ర ప్రభుత్వం సిరిసిల్ల మెగా పవర్ లూం క్లస్టర్‌ను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మారిపోయి బీజేపీ ప్రభుత్వం రావడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. 2016 బడ్జెట్ సమయంలో అప్పటి మంత్రి కేటీఆర్ పలు మార్లు ఢిల్లీకి వెళ్లారు. అప్పటి చేనేత జౌళిశాఖ మంత్రి సంతోష్ గంగువార్‌ను కలిసి వస్త్ర పరిశ్రమ సమస్యలను వివరించారు. మెగా పవర్‌లూం క్లస్టర్ ప్రతిపా దనలు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి పంపించామని తెలపడంతో ఆ బడ్జెట్‌లో పవర్‌లూం క్లస్టర్ చోటు దక్కు తుందని భావించారు. మొదటి విడతలో దేశంలో ఐదు మెగా క్లస్టర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా సిరిసిల్లకు చోటు దక్కలేదు. 2017 బడ్జెట్ సమయంలో మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్, అప్పటి చేనేత జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీని కలిసి మెగా పవర్‌లూం క్లస్టర్ ను సాధించుకునే విధంగా చర్యలు చేపట్టారు. కానీ ఆ బడ్జెట్‌లో కూడా మోక్షం లభించలేదు. అదే క్రమంలో 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024 బడ్జెట్‌లో కూడా అదే పరిస్థితి ఎదురైంది. ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్‌లో సిరిసిల్ల వస్త్రోత్పత్తికి భారీగా కేటాయింపులు ఉంటాయని, సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి నిధులు కేటాయిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో క్లస్టర్‌పై మొండిచేయి

కేంద్ర ప్రభుత్వం ఎనిమిది బడ్జెట్‌లలో

సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ ఇస్తుందని ఎదురు చూసినా మొండిచేయి మిగిలింది. తాజాగా 23వ తేదీన పూర్తిస్థాయి 2024 కేంద్రబడ్జెట్‌లోనూ మెగా పవర్‌లూం క్లస్టర్‌కు చోటు దక్కలేదు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి కే తారకరామారావు కేంద్ర బడ్జెట్ సమయంలో లేఖలు రాయడం, మంత్రులను కలిసిన ఫలితం లేకుండా పోయింది. ఇదే క్రమంలో గతంలో కేటీఆర్, సిరిసిల్ల నియోజక వర్గంలోని 36 గ్రామాలతో కలిపి టెక్స్‌టైల్ జోన్‌గా మార్చడానికి ప్రతిపాదనలు పంపించినా గత ప్రభుత్వ హయాంలో మోక్షం లభించలేదు. కానీ ప్రభుత్వ ఆర్డర్లతో సిరిసిల్ల నేత కార్మికులకు చేతి నిండా పని దొరికింది. టెక్స్‌టైల్ క్లస్టర్‌గా మారితే సిరిసిల్లలో ప్రారంభమైన గార్మెంట్ రంగంలో మహిళలకు మరింత ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. సిరిసిల్ల శివారులో 60 ఎకరాల్లో రూ. 174 కోట్లతో అపెరల్ పార్కు నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే బహుళ జాతి కంపెనీలు గార్మెంట్ ఉత్పత్తులను ప్రారంభించాయి. దీనికి తోడుగా 88 ఎకరాల్లో రూ.374 కోట్లతో వర్కర్ టు ఓనర్ పథకం చేపట్టినా అందుబాటులోకి రాలేదు. కార్మికులను ఓనర్‌లను చేసే షెడ్ల నిర్మాణాలు టీఎస్ ఐఐసీ ఆధ్వర్యంలో పూర్తయ్యాయి. మోడల్ మరమ గ్గాలను కూడా ఏర్పాటు చేశారు. మొదటి విడతలో 4416 మరమగ్గాలు అందుబాటులోకి తెచ్చి 1104 మంది కార్మికులు ఓనర్లుగా మార్చే కార్యక్రమం ఈ బడ్జెట్‌తో తీరుతుందనే ఆశలో ఉన్నారు. మరోవైపు బతుకమ్మ చీరల ఆర్డర్లు నిలిచిపోవడంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుంది. ప్రభుత్వ ఆర్డర్ల కోసం ప్రత్యేక ప్యాకేజీతో పాటు ఉత్పత్తి ఆర్డర్ల క్యాలెండర్‌కు బడ్జెట్ ఊతమి స్తుందని భావిస్తున్నారు.

5లోగా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

తంగళ్లపల్లి, జూలై 24: జూన్ 2024 వరకు పట్టాదారు పుస్తకం ఉన్న రైతులందరు రైతుబీమా కోసం ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల లోపు వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన రైతులు ఆగస్టు 5వ తేదీలోగా ఏఈవోను సంప్రదించాలని సూచించారు. రైతులు ఏఈవో సమక్షంలో సంతకం చేయాలన్నారు. గతంలో బీమా పొందిన రైతులు మార్పులు చేర్పులకు జూలై 30లోగా సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలు

వేములవాడ టౌన్, జూలై 24 : వేములవాడ ఆర్టీసీ ఆధ్వర్యంలో బుధవారం ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసీ మీద నమ్మకంతో ప్రయాణికులుబస్సుల్లో ప్రయాణిస్తున్నారన్నారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చాలన్నారు. డ్రైవర్లు అప్రమత్తతో ఉండాలని, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ వాడరాదని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



తహసీల్దార్‌కు అభినందనలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

ఇల్లంతకుంట, జూలై 24: ఇల్లంతకుంట తహసీల్దార్‌గా ఫారూఖ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన ఇజాజ్ అహమ్మద్ సిరిసిల్ల కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. కలెక్టరేట్ నుంచి ఫారూఖ్ ఇల్లంతకుంట మండలానికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను సిబ్బంది అభినం దనలు తెలిపారు. కార్యక్రమంలో డీటీ సత్యనారాయణ, ఆర్ఐ షఫీ, సంతోష్, సింగారెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ రోజు ఫీవర్ సర్వే నిర్వహించాలి

కోనరావుపేట, జులై 24 : ప్రతీరోజు ఫీవర్ సర్వే నిర్వహించాలని మండల వైద్యాధికారి వేణు మాధవ్ అన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్‌లోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సూపర్‌వైజర్ రషీద్, ఏఎన్ఎం దీపిక, ఎంహెచ్‌పీ సన్నిహిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన సీఐ



యువకులను ఆస్పత్రికి తరలిస్తున్న సీఐ

వేములవాడ టౌన్, జూలై 24: వేములవాడ పట్టణంలో ప్రమాదంలో గాయపడిన యువకులను పోలీస్ వాహనంలో ఆస్ప త్రికి తరలించి సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి మానవత్వం చాటుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వేములవాడ పట్టణానికి చెందిన ఇద్దరు అమర వీరుల స్తూపం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి పడి ఉన్నారు. పెట్రోలింగ్‌లో భాగంగా అటుగా వెళ్తున్న సీఐ గమనించి వెంటనే వారిని పోలీస్ వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మిగిలిన సీనియర్లకు పదోన్నతులు కల్పించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 24 : ఉపాధ్యాయుల బదిలీల్లో మిగిలిన సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో అవకాశం కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం డీఈవో రమేష్‌కుమార్‌కు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్, జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మల్లేశం, టీఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హోజునాయక్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు కొండికొప్పుల రవి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఒకరికి మూడు పోస్టులు ఆన్‌లైన్ ద్వారా రావడంతో ఒక పోస్టులో మాత్రమే చేరారని, ఇతర సబ్జెక్టులలో మిగిలిన రెండు రోస్టర్ పాయింట్లు మిగిలిపోయాయని అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు రోస్టర్ పాయింట్ ద్వారా తీవ్ర అన్యాయం కలుగుతోందన్నారు. మిగిలిన సబ్జెక్టులలో రోస్టర్ కోల్పోయిన ఎస్సీ, ఎస్టీలకు తిరిగి సీనియార్టీ ఉపాధ్యాయులకు లెఫ్టోవర్ వేకెన్సీలో పదోన్నతులు కల్పించాలని కోరారు.

అభివృద్ధి కోణంలో ఆలోచించాలి



గంభీరావుపేటలో మాట్లాడుతున్న కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట, జూలై 24: కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం కోణంలో కాకుండా ప్రాంతాల వారీగా అభివృద్ధిపై ఆలోచన చేయాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేటలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ పుట్టిన రోజు వేడుకల అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల వ్యవధిలోనే అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఈ అంశం అందరి మనస్సుల్లో ఉందని, కాకపోతే ప్రజల తీర్పును గౌరవించక తప్పదని అన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి నాయతకత్వంలోని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో 16 ఎంపీ సీట్లలో కాంగ్రెస్ 8, బీజేపీ 8 గెలుచుకున్నా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో తెలంగాణకు పైసా ప్రాధాన్యమివ్వకపోవడంతో బాధాకరమన్నారు.

ఐఐటీ విద్యార్థినికి ప్రభుత్వం అండ

- చదువు పూర్తయ్యేవరకు ఆర్థిక సహాయం
- సీఎంవో ఆదేశాలు జారీ

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 24: ఐఐటీ పాట్నాలో సీటు సాధించిన పేద విద్యార్థినికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. చదువు పూర్తయ్యే వరకు ఆర్థిక సహాయం అందించాలని సీఎంవో ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆ విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి అడ్డంకులు తొలగిపోయాయి. రాజన్న సిరిసిల్ల వీర్నపల్లి మండలం గోనే నాయక్ తండాకు చెందిన బదావత్ రాములు - సరోజ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. ఇద్దరు డిగ్రీ పూర్తి చేసి వ్యవసాయ పనుల్లో సహాయ పడుతున్నారు. మూడో కూతురు మధులత జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ చూపి ఎస్టీ కేటగిరిలో 824వ ర్యాంక్ సాధించింది. పాట్నా ఐఐటీలో సీట్ వచ్చింది. నిరుపేద కుటుంబం కావడంతో రూ.3 లక్షల ఫీజు చెల్లించలేని స్థితిలో ఉంది. ఆమె ఆర్థిక ఇబ్బందులపై మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఆ విద్యార్థినిని బుధవారం హైదరాబాద్‌కు పిలిపించారు. ఆమెకు చదువు పూర్తి చేసేందుకు కావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందించాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ నుంచి నిధులు అందించాలని సూచించారు. విద్యార్థినిని సీఎం అభినందించారు. చదువులో రాణించాలని, ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మధులత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సాయం సంతోషాన్నిచ్చింది

- బాదావత్ మధులత, విద్యార్థిని, వీర్నపల్లి



నిరుపేద కుటుంబంలో పుట్టిన నాకు ఉన్నత చదువుల కోసం సీఎం రేవంత్ రెడ్డి సాయం చేయడం మా కుటుంబానికి సంతోషాన్నిచ్చింది. జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో ర్యాంకు సాధించినా డబ్బులు లేక ఇంటి వద్ద ఉన్న నన్ను ప్రభుత్వం ఆదుకుంది. ఉన్నత చదువులు చదివి మంచి స్థాయిలో ఉండాలనేది నా కోరిక. గిరిజన నిరుపేద కుటుంబంలో ఉన్న నన్ను గుర్తించి నాలుగేళ్ల చదువు కోసం ప్రభుత్వం తరపున స్కాలర్‌షిప్ అందించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

ప్రగతిలో ఉన్న ఇళ్లను పూర్తి చేయాలి

● కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 24: జిల్లాలో ప్రగతిలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలపై నిర్వహించిన సమీక్షలో మాటా డారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం తదిదశలో ఉన్న ఇళ్లతోపాటు గోడలు, చెత్తులు పడిన ఇళ్లను కూడా పూర్తి చేయాలని సూచిం చారు. ఇప్పటి వరకు ప్రారంభం కానివాటితో పాటు పునాదుల్లో ఉన్నవాటిని నిలిపి వేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధా బాయి, పంచాయతీ రాజ్ ఈఈ భూమేష్, ఆర్అండ్‌బీ డీఈ నాగరాజు, టీఎస్ ఈడబ్ల్యూ ఐడీసీ ఈఈ అనిత సింగనాథ్, హౌసింగ్ డీఈ భాస్కర్ పాల్గొన్నారు.

ముసురుకుంది..

సిరిసిల్ల జూలై24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో బుధవారం రోజంతా ముసురుకమ్మింది. జిల్లాలో పలు చోట్ల వర్షపు జల్లులు పడ్డాయి. కళాశాలు, పాఠశాలకు వెళ్లే విద్యా ర్థులు, ఉద్యోగులు, వివిధ పనులకు వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. రైతులు కాలం కలిసి వస్తుందని ఆనం దం వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి జిల్లాలో వాగులు, ఒర్రెలు పారుతున్నాయి, చెక్ డ్యాంలు, పలు చెరువులు మత్తడి దూకుతున్నాయి. బుధవారం ఉదయం వరకు జిల్లాలో 9.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం ఈ సీజన్‌లో 312.1మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి 376 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.



సిరిసిల్లలో కురుస్తున్న వర్షం

విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలి



సిరిసిల్ల సెస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సిరిసిల్ల రూరల్, జూలై 24: వస్త్ర పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలని, పరిశ్రమలను నాలుగో కేటగిరీలోకి మార్చాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, ఏఐటీయూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పంతం రవి, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు అడెపు భాస్కర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వస్త్ర పరిశ్రమలు, అనుబంధసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరం నుంచి బుధవారం యజమానులు, ఆసాములు, కార్మికులు, కార్మికసంఘాల నాయకులు ర్యాలీగా సిరిసిల్ల సెస్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమలను కుటీర పరిశ్రమలుగా గుర్తించాలన్నారు. సెస్ పాలకవర్గం, అధికారులు స్పందించి పరిశ్రమలు సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు. జేఏసీ నాయకులు ఎనుగుల ఎల్లయ్య, మోర రాజు, మండల సత్యం, పిస్కమధు, చేరాల అశోక్, సిరిసిల్ల రవీందర్, లక్ష్మీనారాయణ, బాలరాజు పాల్గొన్నారు.

ఈత చెట్లను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

జగిత్యాల రూరల్, జూలై 24 : జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామానికి చెందిన పత్తిరెడ్డి తిరుపతిరెడ్డి అనే వ్యక్తి గత కొన్నిరోజుల క్రితం ఎస్సారెస్పీ భూమిలో నాటిన 150 ఈత చెట్లను ధ్వంసం చేశాడని ఎస్సై సధా కర్ తెలిపారు. ప్రభుత్వ భూమిలో హరితహారంలో నాటిన ఈత చెట్లను తొలగించిన తిరుపతిరెడ్డిపై జగిత్యాల రూరల్ ఎంపీడీఓ బుధవారం జగిత్యాల రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తిరుపతిరెడ్డిపై కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

● 52.1గ్రాముల బంగారం, 55 గ్రామాలు వెండి ఆభరణాలు
● ద్విచక్ర వాహనం, మొబైల్ స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి, జూలై, 24: మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో దొంగతనాలకు పాల్పడు తున్న ఇద్దరిని చాకచక్యంగా పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్ట ణంలోని పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై చిరంజీవితో కలిసి వివరా లను వెల్లడించారు. పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన శ్రీరామ్ శివసాగర్, కట్ట మల్లేష్‌లు అనే ఇద్దరు కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పట్టణంలోని ప్రియదర్శిని కాలనీలో ఈనెల 12న ఇంటికి తాళం వేయగా దానిని ఇనుప రాడ్‌తో పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరవాలో దాచుకున్న బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదే ఇద్దరు దొంగలు ఈ నెల 22న ఇబ్రహీంపట్నం శివారులో మహిళను కత్తితో బెదరించి మెడలోని తాళి ఎత్తుకెళ్లారు. బాధితు రాలు ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. డీఎస్పీ ఆదేశాల మేరకు మెట్ పల్లి పాత బస్టాండ్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా శ్రీరామ్ శివసాగర్, కట్ట మల్లేష్ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. వారి నుంచి సుమారు రూ. 4 లక్షల విలువ గల 52.1గ్రాముల బంగారం, 55 గ్రాముల వెండి ఆభరణాలు, ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ముస్తాబాద్, జూలై 24: మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో వరకట్నం వేధిం పులతో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లికి చెందిన ఎనగంటి రేఖ (25)కు ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లెకు చెందిన అంజనేయులుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. అంజనేయులు తరచూ తాగివచ్చి గొడవకు దిగేవాడు. అదనంగా కట్నం తేవాలని వేధించేవాడు. దీంతో భర్త వేధింపులు తాళలేక బుధవారం ఇంట్లో ఉరేసుకుంది. రేఖ తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కరీంనగర్ క్రైం, జూలై 24: కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడని రెండో టాణా హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తెలిపారు. కరీంనగర్ మతాశిశు ఆసుపత్రి ఆవరణలో ఈ నెల 15న స్పృహ తప్పిపడి పోగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. మృతుడిని గుర్తించినవారు కరీంనగర్ రెండో టాణా సీఐ 8712670762 లేదా ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్ట్ హెడ్ కానిస్టేబుల్ కె.రవీందర్ 9491481433కి సమాచారం అందించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

జగిత్యాలరూరల్, జూలై 24: జగిత్యాల రూరల్ మండ లం మోరపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇరగదిండ్ల రాజు (45) గ్రామ శివారులోని చెరువులోకి తన తమ్ముడు గణేష్‌తో కలిసి బుధవారం చేపల వేటకు వెళ్లారు. విద్యుత్ వైర్లతో చేపలుపడుతున్న క్రమంలో ప్రమాదశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో రాజు అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్యకేతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు రాజుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై గొడ్డలితో దాడి..

జ్యోతినగర్, జూలై 24: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి లోని మాతంగి కాలనీలో మంగళవారం రాత్రి తుంగపిండి రాజమ్మ (55)పై ఇంటి పక్కనే ఉంటున్న మేకల సమ్మయ్య గొడ్డలితో దాడి చేశాడు. రాజమ్మను కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించి చికిత్స చేయిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ బుధవారం తెలిపారు.

డ్రైనేజీలోకి దూసుకెళ్లిన లారీ

శంకరపట్నం, జూలై 24: మండలం కేశవపట్నంలో ఓ లారీ అదుపు తప్పి మురికి కాలువలోకి దూసుకెళ్లింది. మండలంలోని కరీంపేటకు వెళ్తున్న లారీ కేశవపట్నంలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి మురికి కాలువలోకి దూసుకెళ్లింది.

బస్సులో రూ. రెండు లక్షలు లభ్యం

పోలీసులకు అప్పగించిన యువకులు



హుజూరాబాద్‌లో ఎస్ఐ హైమద్‌అలీకి నగదును అందజేస్తున్న యువకులు

హుజూరాబాద్, జూలై 24: బస్సులో లభించిన రెండు లక్షల రూపాయలను పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నారు ఇద్దరు యువకులు. బుధవారం పరకాల నుంచి హుజూరాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని వ్యక్తి రెండు లక్షల రూపాయలు ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయాడు. అదే బస్సులో బెజ్జంకికి చెందిన విలసాగరం ప్రమోద్, రేగొండకు చెందిన మొర ఉదయ్‌కుమార్ అనే యువకులు ప్రయాణిస్తున్నారు. బస్సులో సీటుపై ఉన్న బ్యాగ్‌ను చూడగా అందులో రెండు లక్షలు రూపాయలు కనిపించాయి. వారు ఆ నగదును తీసుకెళ్లి హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ హైమద్‌అలీకి అప్పగించారు. ఎస్ఐ హైమద్ అలీ ప్రమోద్, ఉదయ్‌కుమార్‌లను అభినందించారు. విచారణ జరిపి బ్యాగ్ మరిచిపోయిన వ్యక్తికి నగదును అందజేస్తామని ఎస్ఐ తెలిపారు.

శాతవాహన పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేష్‌నగర్, జూలై 24: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించనున్న బీపీఈడీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ బుధవారం విడుదల చేశారు. బీపీఈడీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు ఒకటి నుంచి 8వరకు జరగనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్షలు..

శాతవాహన యూనవర్సిటీ పరిధిలో నిర్వహించనున్న ఎల్ఎల్‌బీ 1, 2వ సెమిస్టర్ లా పరీక్షల షెడ్యూల్‌ను యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఎల్ఎల్‌బీ 1, 2వ సెమిస్టర్లు (సప్లిమెంటరీ) పరీక్షలు ఆగస్టు 1 నుంచి 9వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

శిథిలావస్థలో.. వేద పాఠశాల భవనం



పురాతన భవనంలో కొనసాగుతున్న రాజరాజేశ్వర వేద పాఠశాల

- విద్యనభ్యసిస్తున్న 30 మంది విద్యార్థులు
- వసతులు కల్పిస్తే పెరగనున్న సంఖ్య
- నూతన వేద పాఠశాల భవనం నిర్మించాలని డిమాండ్



ర్యాక్‌లపైన విద్యార్థుల దుస్తులు

వేములవాడ కల్చరల్, జూలై 24: వేములవాడలోని వేద పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో జూన్ 2018లో వేద, ఆగమ, సంస్కృత విద్యాలయ ట్రస్టు ఆధ్వర్యంలో రాజ రాజేశ్వర వేద పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు పండితులు వేద విద్యార్థులకు విద్యను బోధిస్తున్నారు. చిన్నారులు హిందూ ధర్మ పరిరక్షణకు నిమగ్నమై ఉచ్చరించే మంత్రాలు చుట్టుపక్కల నిత్యం ప్రతిధ్వనిస్తున్నాయి. వేదానికి ఊపిరినిచ్చే పాఠ శాల శిథిలావస్థకు చేరుకుంటోందని, నూతన భవనం నిర్మిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు

వేములవాడ రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్టు వేద పాఠశాలలో మొత్తం 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఋగ్వేదం 9, యజుర్వేదం 8, సామవేదం 7, అధర్వణ వేదం 5, స్మార్తం 1 హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు ఉండగా మరో స్మార్తం, వేదం చదివే ఐదుగురు విద్యార్థులు ఇంటి నుంచి వస్తున్నారు. బీహార్ నుంచి ఒక విద్యార్థి, మధ్యప్రదేశ్ నుంచి ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ నుంచి ము గ్గురు విద్యార్థులు వేములవాడ వేద పాఠశాలలో వేదా లను చదువుతున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

పురాతన భవనంలో వేదపాఠాలు

వేములవాడ రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయం జీ ప్లస్ వన్ అంతస్థుల పురాతన భవనంలో కొనసాగుతోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లోని హాల్‌లో ఒకే చోట విద్యార్థులకు విద్యాబోధన చేపడుతున్నారు. మొదటి అంతస్థులో విద్యార్థులకు కిచెన్ సామగ్రి ఏర్పాటుకు, భోజనశాల, విద్యార్థులు దుస్తులు భద్రపరుచుకునేందుకు వాడుతున్నారు. విద్యాబోధన చేస్తున్న గ్రౌండ్ ఫ్లోర్‌లోని హాల్‌లోనే విద్యార్థులు రాత్రి వేళల్లో నిద్రిస్తున్నారు. విద్యార్థులు మంత్రాలను కంఠస్థం చేయాల్సి ఉన్నందున విడివిడి గదులు ఉండాల్సి ఉండేది. గదులు లేకపోగా ఒక హాల్ లోనే విద్యార్థులు విద్యాబోధన చేయడంతో ఇబ్బందికరంగా మారుతోంది.



చదువుకుంటున్న విద్యార్థులు

విద్యార్థులకు అందుబాటులో నాలుగు వేదాలు..

రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్టు ఆధ్వర్యంలో నలు గురు వేద పండితులు నాలుగు వేదాలను అందిస్తున్నారు. ఋగ్వేదం శాఖల శాఖ 10 సంవత్సరాలు, యజుర్వేదం కృష్ణ యజుర్వేదం 11, 12 సంవ త్సరాలు, సామవేదం కౌథురశాఖ 10 సంవత్సరాలు, అధ ర్వణవేదం శౌనఖ శాఖ 5,6 సంవత్సరాల పాటు చెప్పపడుతుందని అధికారులు తెలిపారు. స్మార్తం 4 సంత్సరాలు ఉంటుందని, వేదం, ఆగ మం, సంస్కృతం విద్యార్థు లకు బోధిస్తున్నట్లు తెలిపారు. వేద గణితం, కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నిత్యం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వేద పాఠశాల నిర్మాణానికి ప్రణాళిక

ఆంజనేయశర్మ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వేదపాఠశాల, వేములవాడ.




వేములవాడ రాజరాజేశ్వర వేద ఆగమ, సంస్కృత విద్యాలయ ట్రస్టులో మొత్తం 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు వేదాలకు నలుగురు వేద పండితులు అందుబాటులో ఉన్నారు. వేద పాఠశాలను అత్యధునాతన టెక్నాలజీతో విశాలమైన స్థలంలో నిర్మిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీలో భాగంగా వేద పాఠశాలను నిర్మించాలని గత ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.



వేదపాఠశాలలో విద్యార్థులు

ఆర్మేనియా, రష్యాలో ఉద్యోగాల పేరిట మోసం

- గల్ఫ్ ఏజెంట్ అరెస్టు
- వివరాలు వెల్లడించిన రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్ల క్రైం, జూలై 24: ఆర్మేనియా, రష్యాలో యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని మోసం చేసిన రుద్రంగి మండలం మానాల అడ్డబోర్ తండాకు చెందిన అజ్మీరా కిషన్ అనే గల్ఫ్ ఏజెంట్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గల్ఫ్ ఏజెంట్ కిషన్ తన ఇద్దరితో కలిసి ఆర్మేనియా, రష్యాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, లక్షల్లో జీతాలు వస్తాయని అమాయక యువకులను నమ్మిస్తున్నారు. అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారు. మానాల గ్రామానికి చెందిన కోల కృష్ణం రాజు వద్ద ఉపాధి నిమిత్తం ఆర్మేనియా నుంచి రష్యా పంపిస్తానని నెలకు లక్ష జీతం వస్తుందని చెప్పి రూ. 4.50 లక్షలు వసూలు చేశాడు. ఇదే విధంగా పెగ్గర్లకు చెందిన రంజిత్ వద్ద రూ.7.50 లక్షలు, మెట్‌పల్లికి చెందిన గరిపెల్లి శశిధర్ వద్ద రూ.6.50 లక్షలు, అంబారి పేట నరేష్ వద్ద రూ. 4.70 లక్షలు, ఆత్మకూరుకు చెందిన పుప్పాల సందీప్ వద్ద రూ. 7.50 లక్షలు, మల్లిమాడుకు చెందిన అమరకొండ అనిల్ వద్ద రూ. 4.30 లక్షలు, మెట్‌పల్లికి చెందిన గుం టుక రాజేశ్ వద్ద రూ.2.50 లక్షలు తీసు కొని విజిట్ వీసాలు ఇచ్చి ఆర్మేనియా పంపాడు. అక్కడ 3 నెలలు ఉంచి ఎలాంటి పని చూపించకుండా వసతులు కల్పించకుండా మోసం చేశాడు.

బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టగా ఆజ్మీరా కిషన్, నేపూరి తిరుపతి, కాల్వ ఉమా మహేశ్ మోసాలకు పాల్పడినట్లు తేలిందని, ఇందులో ఆజ్మీర కిషన్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న మిగతా ఇద్దరు ఏజెంట్లను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. ఈ ముగ్గురు కలిసి 60మంది యువకులను గల్ఫ్ పంపిస్తామని మోసం చేశారని, ఎవరైనా బాధితులు ఉంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని, ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లే వారు నకిలీ ఏజెంట్లను నమ్మి మోస పోవద్దని అన్నారు. ఇమిగ్రేషన్, చట్టబద్ధత ఉన్నవారి నుంచి వీసాలు పొందాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్ మోసాలకు పాల్పడుతున్న ఏజెంట్లు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గల్ఫ్ ఏజెంట్ల వివరాలు అవసరమైన యువకులు స్పెషల్ బ్రాంచ్ 8712656411కు ఫోన్ చేసి తెలుసుకోవాలని పేర్కొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం.. ఒకరి రిమాండ్

ఇల్లంతకుంట, జూలై 24: ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన చిక్కుడువానిపల్లె గ్రామానికి చెందిన కంకటి రవిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. వల్లంపట్లకు చెందిన కీసరి నాగరాజు డిగ్రీ పూర్తిచేసి కిరాణం దుకాణం నడుపుకుంటున్నాడు. నాగరాజును కలిసిన రవి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలకడంతో రూ.4 లక్షలు ఇచ్చాడు. ఉద్యోగం ఎప్పుడు ఇప్పిస్తావని తరచూ ప్రశ్నించడంతో నకిలీ అపాయింట్ మెంట్ లెటర్ ఇచ్చాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బిర్యాని సెంటర్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



శాంపిల్స్ సేకరిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునిత

జమ్మికుంట రూరల్, జూలై 24: పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో గల బిర్యాని సెంటర్‌లో జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునిత బుధవారం తనిఖీ చేశారు. హోటల్ లోని బిర్యాని, చికెన్, మసాలలు, నూనె, అల్లం వెల్లుల్లీ పేస్టు, ఇతర సామగ్రిని ఆమె పరిశీలించారు. ఫ్రిజ్‌లో నిల్వ పెట్టిన చికెన్, ఇతర ఆహార వస్తువులు వినియోగదారులకు విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. పలు శాంపిల్స్‌ను సేకరించి వెంట తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునిత మాట్లాడుతూ బిర్యాని సెంటర్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని పలువురు హైదరాబాద్‌లోని ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాను తనిఖీలు నిర్వహించామని తెలిపారు. బిర్యాని, బియ్యం శాంపిల్స్‌ను సేకరించామని, వాటిని ల్యాబ్‌కు పంపిస్తామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

తలనీలాల టెండర్లు వాయిదా



మల్యాల, జూలై 24: కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో భక్తులు సమర్పించే తలనీలాలకు అధికారులు బుధవారం టెండర్లు నిర్వహిం చారు. ఏడాది కాలపరిమితికి సీల్‌టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించగా ముగ్గురు సీల్, 11మంది బహిరంగ వేలంలో పాల్గొన్నారు. అయితే అనివార్య కారణాలతో తలనీలాలు పోగు చేసే హక్కు టెండర్ వాయిదా వేసినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. మరోసారి టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. అలాగే దేవస్థానం తరుపున పోగు చేసిన తలనీలాలకు కూడా అధికారులు సీల్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. సీల్ టెండర్‌లో నలుగురు, బహిరంగవేలంలో 23 మంది డిపాజిట్ చేయగా 14 మంది వేలంలో పాల్గొన్నారు. ఇందులో కిలోకి రూ.8,500 శ్వేత రైస్ ఇండస్ట్రీస్ హెచ్చు పాటగా నిలిచింది. హెచ్చు వేలంను కమిషనర్‌కు నివేదిస్తామని తరువాత కమిషనర్ ఆదేశాలు అమలు చేస్తామని అధికారులు తెలిపారు. వేలంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు అనిల్‌కుమార్, సునీల్ దేవస్థానం సిబ్బంది ఉమామహేశ్వర్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు



గణపతి ఆలయంలో స్వామి వారికి పూజలు

ధర్మపురి, జూలై 24: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు బుధవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, స్థానిక వేదపండితులు మదు రామశర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ భక్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

కోరుట్ల, జూలై 24: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాతంలో ఉన్న బీఎస్సీ అగ్రికల్చర్ గురుకుల కళాశాలలో మౌలిక వసుతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హెదరాబాద్‌లోని అగ్రికల్చర్ కార్యదర్శి ఐఏఎస్ అలుగు శ్యామలకు కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందించారు. కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో సరైన ప్రొఫెసర్లు, కోర్సులకు సంబధించిన పరికరాలు లేవని తెలిపారు. పంటకు సంబధించిన స్థలం లేక విద్యార్థులకు సరైన బోధన అందడం లేదన్నారు. తాగునీరు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అగ్రికల్చర్ హెడ్ ఆఫీస్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ధర్మపురి వద్ద కొనసాగుతున్న గోదావరి వరద



ధర్మపురి వద్ద గోదావరి ప్రవాహం

ధర్మపురి, జూలై 24: ధర్మపురి వద్ద గోదావరి నది వరద బుధవారం కొనసాగుతోంది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి నదిలోకి నీరు చేరుతోంది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరింది. సాయంత్రం 5 గంటల వరకు కడెం ప్రాజెక్టులోనికి 6,451 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన 2, 18వ నెంబర్ గేట్లు తెరచి 13,428 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి విడుదల చేశారు. మూడు రోజుల నుంచి గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల మంగళిగడ్డ, సోమవిహార్, సంతోషీమాత ఆలయ స్నానఘట్టాల ముందు వరకు నీరు చేరింది. నదీ తీరాన గల ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, దమ్మన్నపేట, తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు, పశువులు, గొర్రెల కాపరులను నది వైపు వెళ్లరాదని మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ సిబ్బంది చర్యలు చేపట్టారు. వరద పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రాయపట్నం వంతెన వద్ద కూడ ప్రజలను అప్రమత్తం చేశారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 21,210 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. బుధవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 21,210క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 24.515 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 55.132 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 548 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 19.059 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.203 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

సిరిసిల్ల క్రైం, జూలై 24: గంజాయి మొక్కలు పెంచి యువకులకు విక్రయిస్తున్న ఇల్లంతకుంట మండలంలోని ముస్కానిపేటకు చెందిన జక్కనపల్లి వివేక్, ఇల్లంతకుంటకు చెందిన అంతటి వేణు, తంగళ్లపల్లికి చెందిన క్రాంతిని బుధవారం అరెస్టుచేశామని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. గన్నేరువరం మండలంలోని ఖైలారం గ్రామానికి చెందిన వివేక్ ముస్కానిపేటలో నివాసం ఉంటూ గంజాయి తాగడానికి అలవాటు పడ్డాడు. తంగళ్లపల్లికి చెందిన క్రాంతి వద్ద గంజాయిని కొనగోలు చేస్తున్నాడు. ఈ మేరకు తంగళ్లపల్లిలోని అంబగుడి వద్దకు వస్తున్నారనే సమాచారంతో ముగ్గురు యువకులను పట్టుకొని విచారించారు. దీంతో గంజాయి విక్రయాలు వెలుగు చూశాయి. క్రాంతి తన ఇంట్లోనే గంజాయిని అక్రమంగా సాగుచేస్తూ విక్రయిస్తున్నాడు. వారి వద్ద గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.



నిందితుల అరెస్ట్ చూపిస్తున్న సీఐ మొగిలి

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

సంగెం విద్యార్థి మృతి..



కోరుట్ల రూరల్, జూలై 24 : హైదరాబాదులో రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందడంతో కోరుట్ల మండలంలోని సంగెం గ్రామంలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన పోతుకూరి రవీందర్ రెడ్డి - స్వప్న దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నాడు. కూతురు బీటెక్ పూర్తి చేయగా కుమరుడు హర్షవర్ధన్ రెడ్డి హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్ ప్రాంతంలో అనురాగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి తన స్నేహితునితో ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. తిరిగి రాత్రి కళాశాలకు వస్తుండంగా ఘట్‌కేసర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హర్షవర్దన్ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహం అప్పగించారు. హర్షవర్ధన్ మృతదేహం బుధవారం రాత్రి సంగెం గ్రామానికి చేరుకోవడంతో బంధువులు, గ్రామస్థుల రోదనలు మిన్నంటాయి. గురువారం హర్షవర్ధన్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూలై 24: మండలంలోని తాడికల్ గ్రామంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన దుద్దుల రాజయ్య మోటర్ సైకిల్‌పై మానకొండూర్ వైపు వెళ్తున్నాడు. వరంగల్ వైపు వెళ్తున్న కారు తాడికల్ గ్రామ శివారులో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న రాజయ్యను ఢీ కొట్టింది. దీంతో రాజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేశవపట్నం పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేయాలి

తంగళ్లపల్లి, జూలై 24: తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేయాలని గ్రామస్థులు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో డీఈవోకు వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులు పని చేస్తుండగా ఒకరు దీర్ఘకాలిక సెలవులో వెళ్లారని, వీరిలో ఒకరు తెనుగువారిపల్లెకు, మరొక ఉపాధ్యాయుడు సిరిసిల్ల గర్ల్స్ హై స్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ముగ్గురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారన్నారు. 6, 7 తరగతులలో 13 మంది విద్యార్థులు ఉండగా వారికి గణితం, సామాన్య శాస్త్రం బోధించే వారు లేరన్నారు. డిప్యూటేషన్ రద్దు చేసి తిరిగి పాఠశాలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ లా ఫోరమ్ కన్వీనర్ సామనపెల్లి ప్రశాంత్ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వలకొండ వేణుగోపాల్‌రావు, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, గ్రామస్థులు పొన్నం బాబు, మంత్రి శ్రీకాంత్, కొత్తపెల్లి తిరపతి, ప్రవళిక , జ్యోతి, రేణ తదితరులు పాల్గొన్నారు.

'ఫొటో ఎక్స్‌పో' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై గణేశ్

ముస్తాబాద్, జూలై 24 : ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఏఎంఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన క్రేజీ ఫొటో అండ్ వీడియోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడు తాడెపు రవి ఆధ్వర్యంలో ఎస్సై గణేశ్ ఫొటో ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, కుటుంబ భరోసా ఇన్‌చార్జి సురేశ్, మహంకాళి వేణు, దుబ్బాక రాజు, రంజాని వెంకటేశ్, పల్లె వెంకట్, బడ్డిపడిగె నందు, కొమ్మెట శ్రీకాంత్, సారుగు వెంకటేశ్, కొలపురం నరేశ్, నాగరాజు,అనిల్, కాసోడి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్న కేంద్ర ప్రభుత్వం

ఎల్లారెడ్డిపేట, జూలై 24: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, బడ్జెట్‌పై బీఆర్ఎస్, కాంగ్రెస్ రాద్ధాంతం చేస్తున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా మండల ఉపాధ్యక్షుడు శాగ లక్ష్మణ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌ను కేటాయించిందన్నారు. పల్లెలు, పట్టణాల ప్రగతికి నిధులను విడుదల చేసిందన్నారు. పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు బడ్జెట్‌లో నిధులను కేటాయించిందన్నారు.

దివ్యాంగులపై స్మితాసబర్వాల్ వ్యాఖ్యలు బాధాకరం

ఎల్లారెడ్డిపేట, జూలై 24: దివ్యాంగులపై ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ వ్యాఖ్యలు బాధాకరమని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కానపురం లక్ష్మణ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం నిర్మించేలా పని చేయాల్సిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ దివ్యాంగులపై వివక్ష కనబరిచేలా మాట్లాడడం సరి కాదన్నారు. ఆమె వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ముస్తాబాద్, జూలై 24 : మండలంలోని నామాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వంగ లలిత, హనుమంతరెడ్డి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా హోటల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్



నూతన కార్యవర్గం సభ్యులు

సిరిసిల్ల టౌన్, జూలై 24 : జిల్లా హోటల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం పద్మశాలి కల్యాణ మండపంలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చిప్ప పెంటయ్య, లింగంపల్లి సతీశ్ ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించగా నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా కూన మహేశ్, ప్రధాన కార్యదర్శిగా మేర్గు యాదగిరి, ఉపాధ్యక్షులుగా ఎలి గేటి బాబు, కాసర్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా సాయినేని శ్రీకాంత్, కోశాధికారిగా సురేశ్‌కుమార్, సభ్యులుగా ఎం.గురుబాబు, మేర్గు దశరథ్‌ను ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కూన మహేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని చేపట్టిన రిలే నిరాహారదీక్షలకు మద్దతుగా జిల్లా హోటల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం బంద్‌కు పిలుపునిచ్చామన్నారు.

కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం

ఎల్లారెడ్డిపేట, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా నిధులు తీసుకు రావడంలో విఫలమయ్యారన్నారు. తెలంగాణ ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులు విడుదల చేసి తెలంగాణపై వివక్షను చూపిందన్నారు. నాయకులు గౌస్, లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములుకావాలి

వేములవాడ టౌన్, జూల 24 : వేములవాడ పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మున్సిపల్ పార్క్ నిర్మాణంలో కాంగ్రెస్‌పాత్ర లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అబద్ధాలు చెప్పడం మానుకోవాలని, అభివృద్ధిలో భాగస్వాములుకావాలని అన్నారు. మండల పరిషత్ ఆవరణలో రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన మున్సిపల్ పార్క్‌ను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్ మాట్లాడుతూ పార్క్ నిర్మాణ పనుల్లో కాంగ్రెస్ పాత్ర లేదని మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతోనే పూర్తయినట్లు చెప్పారు.కౌన్సిలర్‌లు అన్నారం ఉమారాణి, ఇప్పపూల అజయ్ పట్టణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్, వెంకటస్వామి, రాకేష్, సత్యలక్ష్మి, లక్ష్మిరాజం, వంగల శ్రీనివాస్, రాజు, మధు, పీర్‌మహ్మద్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



కేకే కట్ చేస్తున్న జిల్లా, పట్టణ అధ్యక్షులు ఆగయ్య, చక్రపాణి

సిరిసిల్ల టౌన్, జూలై 24 : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల పట్టణం అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో రోగులకు బ్రెడ్, పండ్లు అందజేశారు. బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా, పట్టణ అధ్యక్షులు తోట ఆగయ్య, జిందం చక్రపాణి కేక్ కట్ చేశారు. అనంతరం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికులు కుడికాల నాగరాజు, తడక శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఎస్.అనురాగ్‌రెడ్డి సహకారంతో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఒక్కొక్కరికి రూ. 25వేల చొప్పున నగదు రూపంలో ఆర్థిక సహాయం అందించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు రక్తదానం చేశారు. కేడీసీసీ చైర్మన్ కొండూరు రవీందర్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, బీఆర్ఎస్ మహిళా పట్టణ అధ్యక్షురాలు బత్తుల వనజ, కౌన్సిలర్లు అరుణ, దిడ్డి మాధవి, లత, కల్లూరి రాజు, అడ్డగట్ల మాధవి, సత్యనారాయణ, దేవదాస్, అన్నారపు శ్రీనివాస్, జి.శ్రీనివాస్, వినయ్, రాజిరెడ్డి, దినేష్, కో ఆప్షన్ సభ్యుడు సలీం, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడగట్ల మురళి, డైరెక్టర్లు రాజు, కుమార్‌రాజు, మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ జడ్పీ చైర్ పర్సన్ అరుణరాఘవరెడ్డి, మాజీ జడ్పీటీసీలు లక్ష్మణ్‌రావు, రేణ, మాజీ కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్, జ్యోతినగర్, రగుడు, చంద్రంపేట, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్‌లో వార్డు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కౌన్సిలర్లు సత్యనారాయణ, రాజిరెడ్డి, రెడ్డినాయక్, సత్యఎల్లయ్య, లక్ష్మీ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్‌లు వెంకటరమణారావు, శ్యాం, డైరెక్టర్ షేక్ అలీ, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ కిషన్‌యాదవ్, విజయ డెయిరీ చైర్మన్ శ్రావణ్‌రావు, రమేష్‌రావు, దేవయ్య, నారాయణగౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కేక్ కట్ చేశారు. గోరంటాల, గజసింగవరం, శ్రీగాధ గ్రామాల్లో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్య క్షుడు వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దయకర్‌రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ రామాంజనేయులు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి, మాజీ జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, సెస్‌డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, మీడియాసెల్ ఇన్‌చార్జి అనీల్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండెపల్లిలో ప్రభుత్వ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, కొడూరి భాస్కర్‌గౌడ్, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, నాయకులు పడిగెల మానస, సింగిరెడ్డి రవీందర్‌రెడ్, పుసపెల్లి సరస్వతి, అంతయ్య, వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

ముస్తాబాద్ : మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి కూడలిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. పోతుగల్‌లో మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో యువతకు టీ షర్ట్స్ అందించారు. పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహరెడ్డి, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఆనందరావు, సర్వర్‌పాషా, శీలం జనాబాయి, అల్లం లచ్చన్న, యాది మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేటతో గ్రామాల్లో కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక జడ్పీటీసీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తాజా, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, తాజా, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: బీఆర్ఎస్ నియోజవకర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో ఆయన నివాసంలో కేక్ కట్ చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశాయి. ఈ సందర్భంగా రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. రాఘవరెడ్డి, పోలాస నరేందర్, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు నాయకులు కుమ్మరి శ్రీనివాస్, వెంకటరమణరావు, రాజేశం, రవి ఉన్నారు.

బోయినపల్లి : మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొండయ్య, మాజీ వైస్ ఎంపీపీ నాగయ్య, నాయకులు శంకర్, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సిరిసిల్ల సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఫాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, రామ్మోహన్‌రావు, మండల అధ్యక్షుడుదేవయ్య పాల్గొన్నారు.

చందుర్తి : మండలంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య కేక్‌ను కట్ చేసి స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. సింగిల్ విండో చైర్మన్‌లు తిప్పని శ్రీనివాస్, జలగం కిషన్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

రుద్రంగి: కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేగావత్ తిరుపతి, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మాజీ ఎంపీపీ గంగం స్వరూపరాణి, మాజీ వైస్ ఎంపీపీ భూమయ్య, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంటె రెడ్డి పాల్గొన్నారు.



గంభీరావుపేటలో కేక్ కట్ చేస్తున్న రవీందర్‌రావు



వేములవాడలో..



బోయినపల్లిలో



ఎల్లారెడ్డిపేటలో..

కుల సంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు



శాత్రాజుపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

సిరిసిల్ల రూరల్, జూలై 24: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు చిన్నబోనాల భూపతినగర్‌లో బుధవారం పోచమ్మ బోనాల పండగ నిర్వహించారు. గ్రామంలోని కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. కౌన్సిలర్ బోల్లం నాగరాజుగౌడ్, అలువాల అంజయ్య, నరహరి, కుమార్, దేవదాస్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట :మండలకేంద్రంలో పోచమ్మ బోనాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బేడబుడిగ సంఘం, శ్రీవాణీ పాఠశాల విద్యార్థులు డప్పుచప్పుళ్ల మధ్య పోచమ్మ ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. సంఘ నాయకులు టేకు చంద్రయ్య, వణరాసి వెంకటేశం, తిరుపతి, సురేష్, యాదగిరి, చంద్రయ్య కుమార్, దుర్గయ్య పాల్గొన్నారు.

వేములవాడ కల్చరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామంలో బుధవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ ఆలయానికి తరలివచ్చారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో మేర సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు గట్ల మీనయ్య, గట్ల ప్రకాష్ కొడగంటి శ్యామ్, అఖిల్, రాజు పాల్గొన్నారు.

నియామకం

గంభీరావుపేట,జూలై 24 : నేషనల్ హ్యూమన్ రైట్స్, ఉమెన్, చైల్డ్ డెవలప్‌మెంట్ కమిషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంభీరావుపేట మండలం మల్లుపల్లెకు చెందిన గడ్డి హరీష్‌ను నియమించారు. తెలంగాణ గవర్నర్ ఆదేశాల మేరకు గడ్డి హరీష్‌కు బాధ్యతలు అప్పగించినట్లు నియామకపు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను గడ్డి హరీష్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

నేడు న్యాయవాదుల పరస్పర సహకార పరపతి సంఘం ఎన్నికలు

సిరిసిల్ల క్రైం, జూలై 24: జిల్లా న్యాయవాదుల పరస్పర సహకార పరపతి సంఘం(అడ్వకేట్స్ మ్యూచ్‌వల్ కో-ఆపరేటివ్ సొసైటీ) డైరెక్టర్‌ల ఎన్నికలు గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నికలను సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్ పద్మనాయక కల్యాణమండపంలో నిర్వహిం చేందుకు సిద్ధం చేశారు. ఈ ఎన్నికల్లో 12మంది డైరెక్టర్ స్థానాలకు 20మంది న్యాయవాదులు బరిలో ఉన్నారు. సొసైటీలో దాదాపు 147ఓట్లు ఉన్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థులు విస్తృత ప్రచారం చేశారు. పోలింగ్ పూర్తయ్యాక కౌంటింగ్ చేసి ఫలితాలు ప్రకటిస్తామని ఎన్నికల అధికారి అయిల్నేని కిశోర్‌రావు తెలిపారు.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, జూలై 24 : ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎనుగందుల భిక్షపతి కోరారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 25 నుంచి ప్రతీ గ్రామంలో మాదిగ దండోరా ఎమ్మార్పీఎస్ జెండా గద్దెలను నిర్మించి ఆవిష్కరించాలన్నారు. నాయకులు ఖానపురం లక్ష్మణ్ ఆవునూరి ప్రభాకర్ గుండా థామస్, బొల్లారం చంద్రమౌళి, పసుల కమలాకర్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కోనరావుపేట, జూలై 24 : కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో సీఎం సహాయ నిధి చెక్కులను ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చందుర్తి జూలై 24 : చందుర్తి మండలం మల్యాలలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్ బుధవారం పరామర్శించారు. రూ.5000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఏళ్ల రమేష్‌కు ఆర్థిక సాయం అందించారు. నాయకులు రాజేశ్వర్ రావు, ఈసరి శ్రీనివాస్, మాదం బాబు, పాటి సుధాకర్ ఉన్నారు.

పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలి



భిక్షాటన చేస్తున్న కార్మికులు

చందుర్తి జూలై 24: పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ, ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలన్నారు. పంచాయతీ సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్మికుల వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, గ్రామ పంచాయతీ సిబ్బందిని పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని అన్నారు. జీవో నంబరు60 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించాలని, అర్హత కలిగిన సిబ్బందిని పర్మినెంట్ చేయాలని అన్నారు. జీవో నంబరు 51ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత కేటగిరీలన్నింటిని యథావిధిగా కొనసాగించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మృతి చెందిన సిబ్బంది కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. 2011 జనాభా ప్రకారం కాకుండా ప్రస్తుత జనాభా అవసర ప్రాతిపదికన పనిచేస్తున్న వారందరికీ వేతనాలు పెంచాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్మిక సంఘం నాయకులు నరేష్, తిరుపతి పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో యువకుడికి గాయాలు

వేములవాడ రూరల్, జూలై 24 : మండలంలోని మర్రిపల్లి గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్న మనీష్ అనే యువకుడికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయమై రూరల్ ఎస్సై మారుతిని వివరణ కోరగా సదరు వ్యకి బిల్డింగ్ మెట్లపై నుంచి కిందపడడంతో తలకు తీవ్ర గాయాల పాలైనట్లు తెలిపారు. మనీష్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇది ఇలా ఉండగా రైస్ మిల్లు లోని సహచర కూలీలు మంగళవారం అర్ధరాత్రి మనీష్ పై కర్రలతో దాడి చేసినట్లు, దాడిలో గాయాలపాలైన మనీష్ రైస్ మిల్ నుంచి రోడ్డుపైకి పరుగులు తీసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 24: సిరిసిల్ల పట్టణంలోని అంభికానగర్‌లోని ఓ ఇంట్లో ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు బుధవారం రాత్రి సమాచారం రావడంతో దాడులు చేశామని పేర్కొన్నారు. రూ.9,500 నగదు, రెండు ద్విచక్రవాహనాలు, 5 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

వేములవాడ టౌన్, జూలై 24 : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వేములవాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, కార్మికులకు రాజ్యాంగంలోని హక్కులను పొందలేక పోతున్నామని అన్నారు. కార్మికులకు ఆగిపోయిన ఆరు నెలల వేతనాలను చెల్లించాలని, పండగ సెలవులతోపాటుగా దశల వారీగా కార్మికులకు ప్రకటించాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరికి కనీస వేతనం రూ.26 వేలు అందించాలని కోరారు. కార్మి కులందరిని ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కడారి రాములు, అజ్జు, వేణు, పోశెట్టి, క్రాంతి, మల్లేశం, రాజయ్య పాల్గొన్నారు.

మల్లయ్య మృతి పార్టీకి తీరనిలోటు

వీర్నపల్లి, జూలై 24: బీఎస్పీ సీనియర్ నాయకుడు గజ్జల మల్లయ్య మృతి పార్టీకి తీరనిలోటని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గజ్జల అశోక్ తండ్రి, సీనియర్ నాయకుడు మల్లయ్య మృతి చెందడంతో బుధవారం శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ మల్లయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు స్వామి గౌడ్, మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్, న్యాయవాది పిట్టల భూమేష్, జిల్లా నాయకులు కుంట శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు అరుణ్ కుమార్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకుడికి పాము కాటు

చందుర్తి జూలై 24: చందుర్తి మండలం సనుగుల గ్రామ శివారులోని గంగిరెద్దు కాలనీలో బుధవారం రాత్రి ఓ యువకుడిని పాము కాటు వేసింది. గంగిరెద్దుల కాలనీకి చెందిన కొమురయ్య అనే యువకుడు ఇంటి ముందు ఉండగా పాము కాటు వేసినట్లు గ్రామస్థులు తెలిపారు.వెంటనే చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

వస్త్ర పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు



సంఘీభావం తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 24 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందంకళాచక్రపాణి, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్, పవర్ లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, ఏఐటీయూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పంతం రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల జేఏసీ అధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. కేడీసీసీ బ్యాక్‌చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్‌తోపాటు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, పవర్ లూంవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, ఏఐటీయూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పంతం రవిలు కౌన్సిలర్లు, నాయకులు సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వస్త్ర పరిశ్రమపై నిర్లక్ష్యంగా వ్యవరిస్తోందని, ఇందుకు నిరసనగా గురువారం సిరిసిల్ల పట్టణ బంద్‌కు పిలుపునిచ్చామని అన్నారు. పట్టణ ప్రజలు, వాణిజ్య దుకాణాదారులు, హోటళ్లు, టిఫిన్ సెంటర్‌ల యజమానులు బంద్‌కు సహకరించాలని కోరారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, విద్యుత్ సబ్సిడీ ఎత్తివేత, ప్రభుత్వం అర్డర్‌లను ఇవ్వకపోవడంతో పరిశ్రమలు మూత పడ్డాయని అన్నారు. దీంతో ఆసాములు, కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, ఆర్థింగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికే కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేకుండా రాకపోవడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వస్త్ర పరిశ్రమల సమస్యలను పరిష్కరించాలని, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, వైపని నాయకులు ఎనగందుల లింగేష్, స్వర్గం మల్లేశం, బీమానాతిని అంజనేయులు, మేర్గు సత్యనారాయణ, మేర్గు ప్రభాకర్, పాతూరి సత్యనారాయణ, ఇమిడిశెట్టి దత్తాద్రి దీక్షలో కూర్చున్నారు. పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, గోవిందు రవి, దూడం శంకర్, మండల సత్యం, అశోక్, సిరిసిల్ల రవీందర్, మోర రాజు, బూర శ్రీనివాస్, అంకాలపు రవి, బాలరాజు, దేవదాస్, పిస్కమధు, ఎల్లయ్య, అనంద్‌బాబు. బీఆర్ఎస్ నాయకులు రాంమోహన్, సెస్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్

సిరిసిల్ల టౌన్, జూలై 24: వస్త్ర పరిశ్రమపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదని తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా చేనేతపై అధికారికంగా సమీక్ష జరపక పోవడం విచారకరమన్నారు. తెలంగాణ చేనేత ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆరు సార్లు చేనేత శాఖ మంత్రిని కలిసినట్లు, సమస్యలపై వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. 20 మంది ఐక్య వేదిక సభ్యులతో కలసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చినా స్పందించలేదన్నారు. గత ప్రభుత్వ పాలనలో అవమానపరి చారని, ఈ ప్రభుత్వం హయాంలోనైనా చక్క బడుతుందని ఆశపడ్డామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సిరిసిల్ల ప్రాంతంలో కార్మికులు ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లలో చేనేత సహకార సంఘాలు, టెస్కో నిర్వీర్యం అయ్యాయని, అలాంటి పరిస్థితుల నుంచి కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంతో ఆశలు చిగురిస్తాయన్న ఆలోచన నిరాశకు గురి చేసిందని అన్నారు. రాష్ట్రంలోని చేనేత కార్మికుల వ్యవస్థ మీద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు. చేనేత పరిశ్రమ బాగుపడాలంటే ఐఐఎస్‌పీ ద్వారా నేత కుటుంబంలోని చదవుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. తెలంగాణ చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీగాధ షైనయ్య, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుజ్జా తార, ఉపాధ్యక్షురాలు పద్మ, రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడింట్ అంకారపు మహేష్, రాష్ట్ర కార్యదర్శులు కోడం ఆనందబాబు, గుడ్ల విష్ణు, జిల్లా ఉపాధ్యక్షులు దూస సత్తయ్య, గుంటుక మహేష్ పాల్గొన్నారు.